RNI No :TGTEL/26/A3993

గాయత్రి న్యూస్

తెలంగాణ

ప్రచురణ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా - తెలంగాణ బుధవారం 04-11-2026 సంపుటి : 1 సంచిక 160 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 8 వెల రు : 2/-

నిరసనలంటూ అక్కడే కూర్చుంటే ఎలా..?

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- నిరసనల పేరిట ప్రాంతాలను శాశ్వతంగా ఆక్రమించలేరు.
- నిరసనలకు సమయ పరిమితి ఉండాలి: సుప్రీంకోర్టు.

2లో

- ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉంది.
- రైతులు, న్యాయవాదుల నిరసనలకూ అవకాశం కల్పించాలి.
- నిరసనల పరిణామాలకు నిర్వాహకులదే బాధ్యత.
- నిరసనలతో వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం.

గోల్‌కీపర్‌ను ఢీకొని..

మైదానంలో కుప్పకూలి..

ఫుట్‌బాలర్ మృతి

స్పెయిన్‌లోని ఫుట్‌బాల్ క్లబ్ మ్యాచ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మైదానంలో గోల్‌కీపర్‌ను బలంగా ఢీకొనడంతో ఓ 30 ఏళ్ల ఫుట్‌బాలర్ అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. సీడీ టెనెరిఫ్, ఎఫ్‌సీ ఆండోరా క్లబ్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్పెయిన్ లోని ఎస్టాడియో మైదానంలో సోమవారం ఈ మ్యాచ్ జరిగింది. ఇరు జట్లు 2-2 స్కోర్‌తో సమానంగా ఉన్నప్పుడు టెనెరిఫ్ క్లబ్ ఆటగాడు జీసస్ డి మిగెల్ (30) బంతిని ఛేజ్ చేసుకుంటూ ముందుకొచ్చాడు.

2లో

కొనసాగిన బుల్ జోరు..

సెన్సెక్స్ 1200 పాయింట్ల పైకి

- భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు.
- సెన్సెక్స్ 1,225 పాయింట్లు వృద్ధి.
- 76,917.85 వద్ద ముగిసిన సెన్సెక్స్.
- నిఫ్టీ 370 పాయింట్లు పెరిగి 23,810కు చేరిక.
- వరుసగా నాలుగో సెషన్‌లోనూ సూచీల జోరు.

దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారమూ భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, ఎల్‌టీసీజీ ట్యాక్స్ మినహాయింపు ఉంటుందన్న అంచనాలతో మార్కెట్ సెంటిమెంట్ బలపడింది. దీనికితోడు మన ఈక్విటీల్లోకి విదేశీ నిధుల ప్రవాహం కొనసాగడమూ కలిసొచ్చింది. సూచీలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. వరుసగా నాలుగో సెషన్‌లోనూ సూచీలు రాణించాయి. సెన్సెక్స్ 1200 పాయింట్ల పైకి ఎగబాకగా.. నిఫ్టీ 23,800 మార్కును దాటింది. సెన్సెక్స్ ఉదయం 76,288.65 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,692.78) లాభాల్లో ప్రారంభమై.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. చివరికి ఇంట్రాడే గరిష్ఠాల వద్ద 1225.07 పాయింట్లు ఎగబాకి 76,917.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 370.05 పాయింట్లు పెరిగి 23,810.85 వద్ద స్థిరపడింది.

2లో

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై

ఈ - లాటరీ ప్రారంభం

- నాంపల్లి గృహకల్ప కార్యాలయంలో 4 నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ఈ - లాటరీ ప్రారంభించిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

2లో

ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి

1. తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో చర్చలు జరపాలి.
2. ముంపు వివరాలతో సిద్ధంగా ఉండాలి: సీఎం రేవంత్.
3. గత ఒప్పందాలు, పత్రాలను మహారాష్ట్రకు అందించాలి.
4. ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం.
5. పరిహారం నిధులు జాయింట్ అకౌంట్‌లో జమ.
6. మహారాష్ట్ర సర్వేలకు అభ్యంతరం లేదు.
7. అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలి.
8. అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు.

తుమ్మిడిహట్టి బ్యారేజ్ పైన మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని వారికి సూచించారు. ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలని సీఎం స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మిడిహట్టి పైన అధికారులతో సమీక్ష జరిపారు. మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ఇతర అంశాలపైన అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

2లో

ఎన్నికల కంటే ప్రజల ప్రాణాలకే తొలి ప్రాధాన్యం:

అమరావతి: ఎన్నికల కంటే ప్రజల ప్రాణాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మురసు తుపాను పరిస్థితిపై సమీక్ష సందర్భంగా సీఎం మాట్లాడారు. ప్రజల బాధలను తొలగించగలిగితే ఎన్నికల్లో ఫలితాలు వాటంతట అవే వస్తాయని తాను నమ్ముతానని అన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు గడువు పొడిగిస్తున్నట్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ నిలిచిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నామినేషన్ల చివరి రోజు వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితా వెలువరిస్తామని.. ఆ రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు.



క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- పెండింగ్ సమస్యల పరిష్కారం.. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ

2లో

ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావడంతోపాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం, క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం

కాంగ్రెస్ సామాన్యుల ప్రభుత్వం..

ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం: మంత్రి సీతక్క

సర్వోత్తం రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చాం.. ఆశీర్వదించి గెలిపించండి -- మంత్రి సీతక్క

2లో

పురపోరులో కూటమి జైత్రయాత్ర

2లో

ఏలో జరిగిన పుర పోరు లో కూటమి అభ్యర్థులు సత్తా చాటారు. జగన్ సొంత నియోజకవర్గం కడప జిల్లా పులివెందులలోనూ తెదేపా జెండా రెపరెపలాడింది. తిరుపతి తెదేపా మేయర్ అభ్యర్థి మన్నె శ్రీనివాస ప్రసాద్, చిత్తూరు మేయర్ అభ్యర్థి కఠారి హేమలత, గుంటూరు మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఘన విజయం సాధించారు.

సంపాదకీయం

చైనా విజయం మనకు చెబుతున్నదేమిటి?

ఇరవయ్యో శతాబ్ది రెండు మహాయుద్ధాల మధ్యకాలంలో (1919--39) మూడు రకాల ప్రభుత్వ వ్యవస్థలు ప్రపంచ ఆధిపత్యం కోసం పోటీపడ్డాయి. జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముస్సోలినీ ఫాసిస్ట్ సమాజాల్ని నిర్మించారు. స్వల్పకాలంలోనే నివ్వెరపరిచే ప్రగతిని సాధించారు. పూర్వ వైభవాన్ని సాధించిన జర్మనీలో ద్రవ్యోల్బణం పూర్తి నియంత్రణలోకి వచ్చింది. మౌలిక వసతులు భారీగా విస్తరించాయి. పనిచేయగల వారందరికీ ఉపాధి అవకాశాలు లభించాయి. సైనిక పాటవం తేరిపార చూడలేని స్థాయికి పెరిగింది. జాతీయతా భావం తిరిగి ప్రజలను ఉద్విగ్న పరచసాగింది. కమ్యూనిజానికి కేంద్రబిందువుగా నిలిచిన సోవియట్ యూనియన్... మౌలిక వసతులను పెద్దఎత్తున నిర్మించటం, సమష్టి సంపద సృష్టి కార్యక్రమాలు, సైనికీకరణ, క్షిపణి, వైజ్ఞానిక సామర్థ్యాలు, విద్య, ప్రజల నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తేవటం వంటి మార్గాల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేసింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ ఉదార ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక పోటీ, వినియోగదారులకు ఎంపిక స్వేచ్ఛ, మార్కెట్ క్యాపిటలిజం మార్గాన్ని కొనసాగించాయి. ఆ క్షణాన ఫాసిజం అజేయమైన శక్తిగా ప్రపంచానికి కనిపించింది.

ఫాసిజం చిత్తుగా ఓడిపోవటంతో రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. అమెరికా ప్రపంచ ఆర్థిక, సైనిక సూపర్ పవర్‌గా ఆవిర్భవించింది. బ్రిటన్ తన రవి అస్తమించని సామ్రాజ్యాన్ని, ప్రపంచ రాజకీయాల్లో పలుకుబడిని కోల్పోయింది. ఫాసిజంను ఓడించటంలో, నిలువరించటంలో వీరోచిత పోరాటం, అసమాన త్యాగాలు చేసిన దేశంగా సోవియట్ యూనియన్ అమెరికా గుత్తాధిపత్యానికి ఏకైక సవాలుదారుగా నిలిచింది. మరోవంక, తన కమ్యూనిస్టు విప్లవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో సోవియట్ యూనియన్ ప్రారంభించిన అంతర్జాతీయ కమ్యూనిజం కార్యక్రమాన్ని నిలువరించే ఏకైక శక్తిగా అమెరికా మోహరించింది. దీంతో ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. దేశాల మధ్య పోరాటంగా కాకుండా.. మానవ ఆకాంక్షల్ని ఏ రాజకీయ వ్యవస్థ మెరుగ్గా నెరవేర్చగలుగుతుంది? సోవియట్ కమ్యూనిజమా, అమెరికా స్వేచ్ఛా మార్కెట్ క్యాపిటలిజమా? అనే వాదోపవాదాలు వివిధ దేశాలు, రంగాలకు విస్తరించాయి. 1959లో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కృశ్చేవ్, అమెరికా ఉపాధ్యక్షుడు నిక్సన్‌ల మధ్య జరిగిన సుప్రసిద్ధ వంటింటి సంవాదం (కిచెన్ డిబేట్) అంతా "ఏ వ్యవస్థ వల్ల అభివృద్ధి జరిగింది, ఏది నిలదొక్కుకుంటుంది?' అన్న విషయం చుట్టూ తిరిగింది.

చివరికి, రాజుగారి గంగాళంలో పాలు పోసిన తరహాలో గుంపులో గోవిందం పనిసంస్కృతి, రాజ్యవ్యవస్థ గుత్తాధిపత్యం సోవియట్ ప్రజల జీవితాలను ఎలా దుర్భరం చేశాయో ప్రపంచానికి వెల్లడైంది. 1991 పరిణామాలతో పాశ్చాత్య దేశాలు ఈ సైద్ధాంతిక పోరాటంలో విజయం సాధించాయనే అభిప్రాయం ఏర్పడింది. తూర్పు జర్మన్ల పదఘట్టనలే ఓట్లుగా మారి బెర్లిన్ గోడ గత కాలపు చిహ్నంగా మిగిలిపోయింది. గోడకు పేర్చిన ఇటుకలు మ్యూజియం వస్తువులయ్యాయి. దేశం తర్వాత దేశం కమ్యూనిస్టు నియంతృత్వాలపై తిరుగుబాటు చేయటంతో ఇనుప తెర కాస్తా పేకమేడలా కూలిపోయింది. చివరికి, అనూహ్యరీతిలో సోవియట్ యూనియన్ తనను తాను రద్దు చేసుకుంది. ఒక్క తుపాకీ గుండు కూడా పేలకుండా డిసెంబర్ 26, 1991న ఆ చారిత్రక పతనం సంభవించింది. కమ్యూనిజం నామమాత్రమవటంతో పాశ్చాత్య ప్రభుత్వ నమూనా అజేయమన్న అభిప్రాయం కలిగింది.

1945 నుంచి 2010 వరకు చాలా ఏళ్లపాటు ఉదార ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా మార్కెట్లు, పెట్టుబడిదారీ వ్యవస్థ చెట్టాపట్టాలుగా సాగాయి. సంపద సృష్టిలో ఈ సమీకరణ పైచేయి కూడా అనివార్యమన్నట్లు కొనసాగింది. ఆ విశ్వాసాన్నే ప్రచ్ఛన్న యుద్ధం తర్వాత సుప్రసిద్ధ రాజకీయ ఆర్థికవేత్త ఫ్రాన్సిస్ ఫుకుయామ చాలా నిశ్చితంగా వినిపించారు. అయితే, ఇప్పుడు 21వ శతాబ్దంలో చైనా మరో నమూనాను విజయవంతమైనదిగా నిరూపించింది. భౌతిక ప్రగతి, సాంకేతిక ఆవిష్కరణలు, సైనిక పాటవంలో అమెరికాను సైతం ఆత్మరక్షణలోకి నెట్టింది. మావో నమూనా వైఫల్యం తర్వాత డెంగ్ జియావో పింగ్ 1978లో నాలుగు గొప్ప ఆధునిక, సంస్కరణ ప్రక్రియల్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంతో, చైనా అద్భుత ప్రగతి 2001 నుంచి మొదలైంది. ఆ ఏడాది చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలోకి ప్రవేశించటం ఇందుకు దోహదం చేసింది. 2010 నాటికి చైనా ప్రపంచంలోనే వస్తు తయారీ రంగంలో అగ్రస్థానం సాధించింది. ఎగుమతుల్ని ఇబ్బడిముబ్బడిగా చేసింది. ఏ దేశంలో, ఏ విభాగంలో, ఏ మారుమూల ప్రాంతంలో చూసినా చైనా వస్తువులే.

2025 వచ్చేసరికి గణాంకాలు చైనా బలిమిని ఇంకా స్పష్టంగా చాటాయి. ఇప్పుడు ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తుల రంగంలో చైనా వాటా 35 శాతానికి పెరిగింది. తయారీ రంగంలో ఎగుమతులు 20 శాతానికి చేరాయి. మొత్తం అంతర్జాతీయ వాణిజ్యంలో 13 శాతం చైనీయులదే. ప్రపంచంలోనే అత్యధిక వాణిజ్య మిగులు 1.2 ట్రిలియన్ డాలర్లు సాధించిన దేశం చైనా. ఉక్కు (53 శాతం), లిథియం ఇయాన్ బ్యాటరీలు (75 శాతం), సౌర పలకలు (80 శాతం), యంత్రాలు, పరికరాలు (33 శాతం), విద్యుత్ ఉపకరణాలు (40 శాతం), అరుదైన ఖనిజాల వెలికితీత (రేర్ ఎర్త్ మైనింగ్) (60 శాతం), అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్ (91 శాతం), శాశ్వత అయస్కాంతాలు (94 శాతం), విద్యుత్ వాహనాలు (75 శాతం), లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (95 శాతం), బ్యాటరీ సెల్స్ (80 శాతం), సౌర విద్యుత్తు (40 శాతం), థర్మల్ విద్యుత్తు (53 శాతం), బొగ్గు (58 శాతం), సిమెంట్ (53 శాతం)... మొదలైన వాటికి సంబంధించి ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారుగా నిలిచింది. కళ్లు చెదిరే అంకెలివి. ఉదార ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా మార్కెట్లు, పెట్టుబడిదారీ వ్యవస్థను చైనా నమూనా మెరుగుపరిచిందా? అవుననే అభిప్రాయాన్ని ఆ గణాంకాలు ఎవరిలోనైనా స్థిరపరిస్తే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ నేపథ్యంలో, గత ఎనిమిది దశాబ్దాల సంప్రదాయ అభిప్రాయాల్ని పాశ్చాత్య ఉదారవాద దేశాలు పునఃసమీక్షించుకోవాలి. చరిత్ర అంతం కాలేదన్నది సుస్పష్టం! ఈ వాస్తవాల నుంచి రెండు ప్రశ్నలు తలెత్తుతాయి. చైనా ఈ స్థాయి విజయాన్ని ఎలా సాధించింది? ఉదార ప్రజాస్వామ్యాలు ఆధిపత్యాన్ని ఎలా కోల్పోయాయి? ఈ రెండు ప్రశ్నల్నీ కొంత పరిశీలిద్దాం.

మొదటిది, చైనా పెరగటం కంటే ముందు.. ఉదారవాద ప్రజాస్వామ్యాలు మాత్రమే అధిక వృద్ధిని, సాటిలేని ఆవిష్కరణల్ని నమోదు చేశాయన్న వాదన సరికాదు. ఈనాటి ఉదార ప్రజాస్వామిక వ్యవస్థలు, ఆ రకమైన పద్ధతులు లేకుండానే దక్షిణ కొరియా, తైవాన్ గణనీయ ప్రగతిని, ఆవిష్కరణల్ని సాధించాయి. కొంతవరకు, సింగపూర్ ప్రగతిని కూడా ప్రజాస్వామిక నమూనాగా చెప్పలేం. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీ, జపాన్ సాధించిన గొప్ప ప్రగతి సైతం ప్రజాస్వామ్యం ద్వారా వచ్చినది కాదు. కాబట్టి.. ఆవిష్కరణలు, పోటీ, అభివృద్ధికి తగిన విధానాలు, వాతావరణం ఉదార ప్రజాస్వామ్యం లేకున్నా సాధ్యమని హేతుబద్ధంగా భావించవచ్చు. చైనా ప్రగతి ఇదే విషయాన్ని రుజువు చేస్తుంది.

చైనా జీవనశైలి బలమైన కుటుంబ వ్యవస్థ గల ఆసియా సాంస్కృతిక విలువలను అనుసరిస్తున్నది. అలాంటి సమాజంలో పిల్లల ప్రతిభా పాటవాలను వికసింపజేయటానికి అత్యధిక ప్రాధాన్యమిస్తారు. ఇందుకోసం మంచి చదువు, నైపుణ్యాలు, వ్యక్తిగత హక్కుల కన్నా ఉమ్మడి హితానికి పెద్దపీట వేశారు. ఆధునిక సాంకేతికతను, మార్కెట్ ఆర్థిక వ్యవస్థను, స్వేచ్ఛా వాణిజ్యాన్ని అత్యంత సమర్థంగా వినియోగించటం ఈ నమూనాలో భాగం. నాణ్యమైన విద్య, నైపుణ్యాలపై చైనా నిరంతరం దృష్టి కేంద్రీకరించింది. పెద్ద అంశాలు, జాతీయ ప్రాధాన్యం గల విషయాలపై విధాన నిర్ణయాలు పై స్థాయిలో తీసుకున్నా.. వాటి అమలు అత్యధికంగా స్థానిక స్థాయిలోనే జరుగుతుంది. చైనా ప్రభుత్వ వ్యయంలో 54 శాతానికి పైగా స్థానిక ప్రభుత్వాలే నియంత్రిస్తాయి, ఖర్చు చేస్తాయి. ఇది ప్రపంచంలోనే అత్యధిక వాటా! ఒక అర్థవంతమైన విధానంతో, అభివృద్ధి, ఆవిష్కరణలకు దోహదం చేసే పోటీ ఆర్థిక నమూనాకు.. కమ్యూనిస్టు పాలన నుంచి వచ్చే సుస్థిరతను, క్రమశిక్షణను చైనా జోడించింది. తక్షణ రాజకీయ మూల్యం చెల్లించాల్సి ఉంటుందనే భయం లేకుండా దీర్ఘకాల లక్ష్యాలను సాధించే హేతుబద్ధ విధానాలను అనుసరించటానికి చైనా సమాజంపై కమ్యూనిస్టు పార్టీ (సీసీపీ) నియంత్రణ దోహదం చేసిందనటంలో అనుమానం లేదు.

నిర్ణీత పదవీకాలం తర్వాత ఎన్నికలను ఎదుర్కోక తప్పని ఉదార ప్రజాస్వామ్యంలో... దీర్ఘకాల విధానాన్ని కొనసాగించటం తరచూ ప్రతికూలతగా మారే అవకాశముంది. ప్రజలకు తాత్కాలిక ఉపశమనం, సంతృప్తి కలిగించటం రాజకీయ మనుగడకు కీలకం కావటం ఈ నమూనాలో ప్రస్ఫుటంగా కనిపించే లక్షణం. అది ప్రజాస్వామ్యం తప్పు

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ఈ - లాటరీ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ క్యూర్ ఏరియా కి సంబంధించి గోషామహల్ , చాంద్రాయణ గుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్లకు ఈ లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపికకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజాసింగ్, హౌసింగ్ ఎండీ గౌతమ్,ఇతర ముఖ్య అధికారులు ఈ - లక్కీ డ్రా విధానం ద్వారా ఎంపికైన లబ్ధిదారులు 1.కోమల్ అనే మహిళ 2. బచల చైతన్య,3, మధుగుల మమత ,4.గ్యాదరి నందిని,5. చిన్నపగ వీరమణి,6.అమరకీర్తి పేర్లను చదివి వినిపించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌లక్కీ డ్రా ద్వారా ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారికి శుభాకాంక్షలు ప్రజా ప్రభుత్వం లో నియోజకవర్గానికి 5500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరిగింది.. మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇళ్లు ,రెండవ దశలో 2 వేల ఇళ్లు మంజూరు చేయడం జరిగిందనీ తెలిపారు చాలా వరకు మొదటి దశ ఇల్లు పూర్తయ్యాయి.. ఫేజ్ మ్యానర్ లో వారికి డబ్బులు ఇవ్వడం జరుగుతుందనీ గతంలో ఉపాధి ఒక దగ్గర ఉంటే ఇల్లు ఒక దగ్గర ఉండేది.. అక్కడ నిర్మించిన ఇళ్లలో ఉండే పరిస్థితి లేకుండే..అలాంటి పరిస్థితి రావద్దని ఉపాధి ఎక్కడ ఉంటే ఇల్లు అక్కడే ఉండాలని నిర్ణయించాం.. అని తెలిపారు గుడిసెలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో, పార్టీ, కుల, మత సంబంధం లేకుండా అందరికీ ఈ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. మధ్యలో కట్టుకొని ఆపుకున్న వారికి, కొత్తగా ఇళ్లు లేని పేదలకు ఇవి వర్తిస్తాయి.అర్బన్ ప్రాంతాల్లో ల్యాండ్ అవైలబిలిటీ సమస్య మరియు కన్స్ట్రక్షన్ కాస్ట్ తేడా కారణంగా, నియోజకవర్గాల్లోనే స్థలాలు ఉన్నవారికే ఆ స్థలంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.అర్హులైన పేదలందరికీ, ముఖ్యంగా సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోవాలనుకునే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అని పేర్కొన్నారు హైదరాబాద్ లో స్థలాలు లేకపోవడం వల్ల ముఖ్యమంత్రి గారు అత్యంత విలువైన స్థలాన్ని ఇచ్చి అత్యాధునిక ఇల్లు నిర్మించడం జరుగుతుందిఅప్లికేషన్ తర్వాత 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లు లాటరీ జరుగుతుంది..ఈరోజు 4 నియోజకవర్గాలకు సంబంధించి గోషామహల్ చాంద్రాయణ గుట్ట ఎల్బీనగర్ ముషీరాబాద్ నియోజవర్గాలకు డ్రా తీయడం జరుగుతుందన్నారు త్వరలోనే ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరుగుతుంది.ఆర్టీసీ విలువైన స్థలాలు కూడా ఇందిరమ్మ ఇల్లు కి కేటాయించడం జరిగింది..ప్రభుత్వ స్థలాలను సేకరిస్తున్నాం.. అన్నారు అర్హత ఉన్న వారు రేషన్ కార్డులు లేని వారిని ప్రభుత్వం అందిస్తుంది.. కొత్త వారు పేర్లు నమోదు చేసుకోవాలనీ ఆరోగ్య శ్రీ 5-10 లక్షలకు పెంచుకున్నాం..సున్నా వడ్డీ బుణాలు అందిస్తున్నాం.. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం. అని హైదరాబాద్ లో మహిళా సంఘాలు సభ్యత్వం తక్కువగా ఉంది..మహిళలు మహిళా సంఘాల్లో చేరాలి.ూ1 కింద స్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారికి కూడా త్వరలోనే ఇల్లు మంజూరు చేస్తాం..వారు 2 వేల మంది ఉన్నారనీ గుర్తు చేశారు

పురపోరులో కూటమి జైత్రయాత్ర

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కడప, మచిలీపట్నం కార్పొరేషన్‌లలో కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే వైకాపా గెలుపొందింది. ఆదోనిలో జనసేన రెబల్ స్వప్న విజయం సాధించారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

కూటమి అభ్యర్థులు గెలుపొందిన మున్సిపాలిటీలు ఇవే..

తెదేపా: నర్సీపట్నం, పలాస, ఇచ్ఛాపురం, పెద్దాపురం, కొవ్వూరు, మండపేట, ఆకివీడు, నూజివీడు, జగ్గయ్యపేట, జంగారెడ్డిగూడెం, ఉయ్యూరు, నందిగామ, జగ్గయ్యపేట, కొండపల్లి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రేపల్లె, కనిగిరి, ఆత్మకూరు(నెల్లూరు), ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు(నంద్యాల), కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, పెనుకొండ, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, మదనపల్లి, పుంగనూరు, రాయచోటి, వెంకటగిరి, సూళ్లూరుపేట, పలమనేరు, కుప్పం, నగరి, పులివెందుల

జనసేన: గొల్లప్రోలు, తుని, సామర్లకోట, పిఠాపురం, ముమ్ముడివరం, అమలాపురం, నిడదవోలు, నర్సాపూర్, పెడన, తిరువూరు, తెనాలి, దర్శి, మడకశిర, పుట్టపర్తి

భాజపా: గూడూరు(కర్నూలు), ఎర్రగుంట్ల, ఎలమంచిలి

ఎన్నికల కంటే ప్రజల ప్రాణాలకే తొలి ప్రాధాన్యం:

మొదటిపేజీ తరువాయి

ప్రజలకు సుపరిపాలన అందించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థంగా అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు బుధవారం కూడా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నట్లు చెప్పారు. బుడమేరు విషయంలో ఎలాంటి ప్రమాదం లేదని, వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు.

అర్నబ్, మురసు తుపాన్లతో పాటు ఎల్‌నినో ప్రభావం కూడా రాష్ట్రాన్ని వెంటాడుతోందని సీఎం తెలిపారు. మూడు సమస్యలు ఒకేసారి ఎదురుకావడం ఇదే తొలిసారి కావచ్చని అభిప్రాయపడ్డారు. తుపాన్ల ప్రభావంతో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికీ 27 శాతం లోటు వర్షపాతం ఉందని తెలిపారు. రెస్క్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్ కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని చెప్పారు. తుపాన్ల కారణంగా 4,095 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, 548 సబ్‌స్టేషన్లలో సరఫరా నిలిచిపోయిందని ముఖ్యమంత్రి వివరించారు.

కాంగ్రెస్ సామాన్యుల ప్రభుత్వం..

ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డిని ఆశీర్వదించి మండలికి పంపాలని ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు, ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చదువు, సంస్కారం కలిగి, ప్రతి ఒక్కరినీ గౌరవించే వ్యక్తిత్వం ఉన్న సర్వోత్తం రెడ్డిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ఆయన ఎంతో నిరాడంబరంగా ఉంటారని, తండ్రి, పెద్దనాన్న మంత్రులుగా పనిచేసినా ఏనాడూ అధికారం చెలాయించలేదని అన్నారు. వారి కుటుంబం కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిందని, అందుకే ఈసారి సర్వోత్తం రెడ్డికి పార్టీ అవకాశం కల్పించిందని వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. కారుణ్య నియామకాలు చేపట్టామని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రతి నెల మొదటి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. పెండింగ్ బకాయిలను నెలకు రూ.1,000 కోట్ల చొప్పున చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇప్పటికే రూ.4,500 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. కొత్త నిబంధనల పేరుతో ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలు, కళాశాలలను ఇబ్బందులకు గురిచేయడం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఒక టీంగా పనిచేస్తూ ప్రతి హామీని అమలు చేస్తుందని అన్నారు.

కొనసాగిన బుల్ జోష్.. సెన్సెక్స్ 1200 పాయింట్ల పైకి

మొదటిపేజీ తరువాయి

సెన్సెక్స్ 30లో పవర్‌గ్రిడ్, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, టాటాస్టీల్, ట్రెంట్ కంపెనీల షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభపడ్డాయి. ముఖ్యంగా హిందుస్థాన్ యునిలీవర్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 105.56 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 3,906.19 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఎస్‌బీఐ లాభం రూ.23,038 కోట్లు.. ఏడాదిలో 14 శాతం వృద్ధి

కారణాలివీ..

దేశీయ మార్కెట్‌లోకి విదేశీ పెట్టుబడిదార్లను ఆకర్షించడానికి, భారత మ్యూచువల్ ఫండ్‌లకు ఊరట కల్పించేందుకు ఈక్విటీ ప్రతిఫలాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) రద్దు చేయాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటిని పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పడం విదేశీ మదుపర్లలో ఉత్సాహాన్ని నింపింది.

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 105 డాలర్ల వద్ద కొనసాగుతోంది. క్రితం రోజుతో పోలిస్తే ధర స్వల్పంగా పెరిగినప్పటికీ.. ఇటీవలి కాలంలో రికార్డు స్థాయి రేట్లతో పోలిస్తే ధరలు దిగిరావడం మార్కెట్‌కు కలిసొచ్చింది.

భారత ఈక్విటీల్లో విదేశీ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. సోమవారం కూడా రూ.3,115 కోట్ల మేర నిధులను మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టారు. దీనికితోడు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పుంజుకోవడం, కార్పొరేట్ కంపెనీల సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా రావడం సూచీలకు కలిసొచ్చింది.

నిరసనలంటూ అక్కడే కూర్చుంటే ఎలా..?: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

పండగ సీజన్‌లో దిల్లీలో నిరసనలు చేపట్టవద్దంటూ విపక్షాలు, ఇతర గ్రూప్‌లకు వ్యాపార సంఘాలు విజ్ఞప్తి చేస్తోన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల పేరిట ఎవరూ కూడా ఏ ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించుకోవడం వీలుకాదని స్పష్టం చేసింది. ఆందోళనల కోసం కేటాయించిన అధికారిక ప్రదేశాలకూ ఒక సమయ పరిమితి ఉండాలని పేర్కొంది .

"మీరు ఒక ప్రదేశాన్ని శాశ్వతంగా ఆక్రమించుకోవడం వీలుకాదు. ఎప్పటికీ మీ అధీనంలోనే ఉంచుకోలేరు. ఇతర అంశాలపై నిరసనలు చేస్తున్నవారు కూడా ఉన్నారు. రైతులు, న్యాయవాదులు ఎక్కడికి వెళ్తారు..? ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉంది" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. నిరసనలకు పిలుపునిచ్చేవారే.. తర్వాత జరిగే ఎలాంటి పరిణామాలకైనా బాధ్యత వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జులై 20న చేపట్టిన నిరసనకు కేవలం ఒక్కరోజు మాత్రమే అనుమతి ఇచ్చారని, కానీ నిరసనకారులు ఆ ప్రాంతాన్ని ఆక్రమించి, పార్లమెంట్ వరకు మార్చ్ చేశారని మెహతా న్యాయస్థానానికి తెలియజేశారు .

వ్యాపార సంఘాల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. దేశ రాజధానిలో నిరసనల వల్ల కలుగుతోన్న అంతరాయంపై ఆందోళన వ్యక్తంచేశారు. వాణిజ్య కార్యలాపాలపై వాటి ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారులు నష్టపోతున్నారని, రానున్న రెండు నెలల పాటు నిరసనలపై ఆంక్షలు విధించాలని కోరారు. ఈ వాదనల అనంతరం సుప్రీంకోర్టు .. కేంద్ర ప్రభుత్వంతోపాటు, సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది.

గోల్‌కీపర్‌ను ఢీకొని.. మైదానంలో కుప్పకూలి.. ఫుట్‌బాలర్ మృతి

మొదటిపేజీ తరువాయి

అదే సమయంలో గోల్ పోస్ట్ వద్ద ఉన్న ఆండోరా జట్టు గోల్ కీపర్ జీసస్ ఓనో బంతిని ఆపేందుకు పెనాల్టీ ఏరియా వద్దకు దూసుకొచ్చాడు. ఈ క్రమంలో ఫుట్‌బాలర్ మిగెల్ ఛాతీకి గోల్‌కీపర్ ఓనో మోకాలు బలంగా తగిలింది.

దీంతో మిగెల్ నొప్పితో విలవిల్లాడుతూ పిచ్‌పై కుప్పకూలాడు. ఆ వెంటనే కార్డియోరెస్పిరేటరీ అరెస్ట్‌కు గురయ్యాడు. వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి అతడికి సీపీఆర్ చేశారు. దాదాపు 5 నిమిషాల తర్వాత మిగెల్‌కు పల్స్ అందింది. వెంటనే అంబులెన్స్‌లో అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మిగెల్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ టెనెరిఫ్ క్లబ్ సంతాపం ప్రకటించింది. 2015లో సీనియర్ ఫుట్‌బాల్ కెరీర్‌ను ప్రారంభించిన మిగెల్.. పలు క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. గతేడాదే టెనెరిఫ్ క్లబ్‌లో చేరాడు.

క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రెవెన్యూ, హౌసింగ్, భూ సర్వే శాఖలకు సంబంధించిన అంశాలకు క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకునే ఉద్దేశంతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నాడు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలోని షామీర్‌పేటలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇన్‌చార్జి మంత్రులు పాల్గొననున్నారు. రెవెన్యూ సమస్యలు, గృహ నిర్మాణ పథకాల అమలు, భూ సర్వే పురోగతితోపాటు ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్షించనున్నారు.

గత ఏప్రిల్, మే నెలల్లో రాజధాని వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సమావేశాల్లో ఉమ్మడి జిల్లాల వారీగా శాఖల పనితీరు, సమస్యల పరిష్కారంపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. ఆయా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, క్ష

మద్దులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు..

- పార్టీ అనుబంధమే ప్రాతిపదికా అర్హతలే కొలమానమా
- ఇల్లు లేని కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే ఏదీ
- లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరపాలి
- మంత్రి శ్రీధర్ బాబు స్పందించాలి.. అర్హులకు న్యాయం చేయాలి

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లిలో ఓవైపు పక్కా ఇల్లు లేక టార్పాలిన్ల కిందే కాలం వెళ్లదీస్తున్న నిరు పేద కుటుంబాలు.. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల కోసం అశగా ఎదురుచూస్తున్న అర్హులు! సొంతింటి కల నెరవేరుతుందన్న నమ్మకంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న పేదలకు లబ్ధిదారుల ఎంపికపై వినిపిస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇల్లు లేని కుటుంబాల పరిస్థితి ఏమిటి దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ న్యాయం జరుగుతోందా లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ప్రాధాన్యానికి తావుందా అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్దులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

టార్పాలిన్ల కిందే కాపురం!

మద్దులపల్లిలో పక్కా ఇళ్లు లేక టార్పాలిన్లు కప్పుకొని తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్న నిరుపేద కుటుంబాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి పనులపై ఆధారపడి జీవించే కుటుంబాలకు సొంతంగా ఇల్లు నిర్మించుకోవడం ఆర్థికంగా భారంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకమే తమకు భరోసా ఇస్తుందని ఆశిస్తున్నారు. అయితే, అర్హతలు ఉన్నప్పటికీ తమకు ఇల్లు మంజూరవుతుందో లేదోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. ఇల్లు లేని కుటుంబాల వాస్తవ పరిస్థితులను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలిస్తేనేసమస్య తీవ్రత స్పష్టమవుతుంది.

ఎంపికలో రాజకీయ పక్షపాతమా

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలకు చెందినవారికి ఇళ్లు మంజూరు చేసే విషయంలో ముందుగా పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే పరిశీలిస్తామంటూ కొందరు చెబుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ లేదు. వాటిలో వాస్తవాలను తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా నిర్దేశిత మార్గదర్శకాలు, అర్హతల ఆధారంగా అమలవుతున్నాయా లేదా అన్నది పరిశీలించాలి. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అర్హులైన ఏ కుటుంబానికీ అన్యాయం జరగకుండా చూడాలి.

క్షేత్రస్థాయి విచారణే కీలకం!

మద్దులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పక్కా ఇల్లు లేక టార్పాలిన్ల కింద నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని అధికారులు స్వయంగా పరిశీలించాలి. దరఖాస్తుల సంఖ్య, అర్హతల నిర్ధారణ, ఎంపికైన లబ్ధిదారుల వివరాలు, ఎంపికకు అనుసరించిన ప్రమాణాలను సమీక్షించాలి. అర్హులైనప్పటికీ జాబితాలో చోటు దక్కని కుటుంబాలు ఉంటే అందుకు కారణాలను తెలుసుకోవాలి. క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేస్తేనే అర్హులెవరు అన్నది స్పష్టమవుతుంది. ఊహాగానాలకు తావులేకుండా వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మంత్రి శ్రీధర్ బాబు దృష్టి సారించేనా

మద్దులపల్లిలో నిరుపేద కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇళ్ల సమస్యపై మంత్రి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. టార్పాలిన్ల కింద నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని తెలుసుకొని, అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికపై వస్తున్న ఆరోపణలను పరిశీలించి, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూడాలని కోరుతున్నారు.

అధికారుల స్పందన ఏది

మద్దులపల్లిలో ఇళ్ల సమస్యపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది. గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, ఇల్లు లేని నిరుపేద కుటుంబాల వివరాలను సేకరించాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకం మార్గదర్శకాల ప్రకారం అర్హతలను పరిశీలించి, ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలి. ఫిర్యాదులు అందితే వాటిని పరిశీలించి, విచారణలో వెల్లడైన అంశాలను ప్రజలకు తెలియజేయాలి. పేదలకు పక్కా ఇల్లు కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యం. ఆ లక్ష్యం నెరవేరాలంటే అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరగాలి. మద్దులపల్లిలో టార్పాలిన్ల కిందే బతుకులు వెళ్లదీస్తున్న నిరుపేదల పరిస్థితిపై అధికారులు. స్పందించి, వాస్తవాలను వెలికితీసి, అర్హులకు న్యాయం చేస్తారా అన్నది వేచి చూడాలి.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద భారీ పోలీసు బందోబస్తు

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పరిధిలోని మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీ వద్ద మంగళవారం ఉదయం నుంచే తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన భారత్ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు నేడు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు.బీఆర్ఎస్ నేతల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తుగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్యారేజీ పరిసరాల్లో అదనపు బలగాలను రంగంలోకి దించి నిఘాను ముమ్మరం చేశారు.బ్యారేజీ వైపు వచ్చే ప్రతి వాహనాన్ని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తూ క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. బీఆర్ఎస్ నేతల పర్యటన నేపథ్యంలో బ్యారేజీ వద్ద ఏం జరగబోతుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మృతుడు మహాదేవపూర్‌కు చెందిన స్వామిగా గుర్తింపు

మహాదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

మండల పరిధిలోని బీరసాగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. ఇసుక లారీ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని మహాదేవపూర్ మండలం కేంద్రానికి చెందిన పోత పెద్దోళ్ల స్వామి (46)గా పోలీసులు నిర్ధారించారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి వారు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను తీవ్రంగా చలించిపోయేలా చేసింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యల కోసం దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

కాటారంలో పెట్రోల్ బంకుల మాయాజాలం: కొలతల్లో మోసాలు.. నాణ్యతలో కల్తీ!

- అధికారులు పర్యవేక్షించకపోవడంపై వాహనదారుల ఆగ్రహం
- ఆకస్మిక తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని కొన్ని పెట్రోల్ బంకులు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. వినియోగదారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని బంకుల యాజమాన్యాలు కొలతల్లో మాయాజాలం సృష్టిస్తూ, నాణ్యత లేని ఇంధనాన్ని విక్రయిస్తూ అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిఘా లోపం, తూతూమంత్రంగా సాగుతున్న తనిఖీల కారణంగా ఇక్కడి బంకుల యాజమాన్యాలకు 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా వ్యాపారం సాగుతోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మైలేజ్ రాదు.. పెట్రోల్లో నీళ్లు!

ఇటీవల మండలంలోని ఓ పెట్రోల్ బంకులో ఓ వాహనదారుడు డీజిల్ పోయించుకుని వరంగల్‌కు బయలుదేరాడు. అయితే, మార్గమధ్యంలోనే ఇంధనం అయిపోవడంతో సదరు వాహనదారుడు తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యాడు. పోయించిన డీజిల్‌కు కనీస మైలేజ్ కూడా రాకపోవడం ఇక్కడి కొలతల్లో జరుగుతున్న మోసానికి అద్దం పడుతోంది.ఇదిలా ఉండగా, మరో బంకులో ఘోరం వెలుగుచూసింది. ఓ వాహనదారుడు అనుమానంతో తన వాహనం ట్యాంక్ తెరిచి చూడగా, పెట్రోల్‌లో భారీగా నీరు కలవడాన్ని గమనించి షాక్‌కు గురయ్యాడు. దీనిపై సదరు వాహనదారుడు బంక్ సిబ్బందిని నిలదీయగా, వారు కనీసం పట్టించుకోకుండా బాధ్యతారహితంగా, నిర్లక్ష్య సమాధానాలు చెప్పడం గమనార్హం.

అధికారుల కనుసన్నల్లోనే మేనేజ్

ఈ ప్రాంతంలో లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతల శాఖ) అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, వారు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఇతర అధికారులు ఎవరైనా తనిఖీలకు వస్తున్నారనే సమాచారం ఉంటే.. బంక్ యాజమాన్యాలకు ముందస్తుగానే 'సమాచారం' అందుతోందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీంతో వారు అన్నిటినీ మేనేజ్ చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా పబ్బం గడుపుకుంటున్నారని వాహనదారులు మండిపడుతున్నారు.

స్పందించాలి.. చర్యలు తీసుకోవాలి

ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కాటారం మండలంలోని పెట్రోల్ బంకుల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. కల్తీ ఇంధన విక్రయాలకు, కొలతల మోసాలకు పాల్పడుతూ వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్న బంక్ యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

భోగి వేడుకలతో ప్రారంభమైన దండారీ ఉత్సవాలు

- ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పూజలు
- బజార్‌హత్నూర్ మండలం చింతలసాంగ్వి‌లో ఘనంగా భోగి పండుగ

బజార్ హత్నూర్: (గాయత్రి న్యూస్)

మండల పరిధిలోని చింతలసాంగ్వి గ్రామంలో ఆదివాసీలు భోగి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకతో దీపావళి పండుగ వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఆదివాసీ పటేల్ ఇంటి అంగణంలో సంప్రదాయ వాద్య పరికరాలైన పర, వెట్టె, గుస్సాడి టోపీలు, కోడల్, తుడుం, డప్పులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇల్లు నుంచి మహిళలు నైవేద్యాలను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో దేవుళ్లకు సమర్పించారు. ఈ రోజు నుంచే ప్రతిష్టాత్మక దండారీ ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. దండారీ వేడుకల్లో భాగంగా యువకులు, గిరిజనులు గుస్సాడి, గుమ్మేల పోరి వేషధారణలు ధరించి నృత్యాలు చేస్తారని గ్రామస్థులు తెలిపారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కొనసాగుతున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర

- నల్లగొండ నుంచి మునుగోడు వైపు బీసీ రాజ్యాధికార యాత్ర
- సంప్రదాయ వృత్తిదారులు, చిరు వ్యాపారులు, రైతులు, యువకులతో ముచ్చట

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

బీసీ రాజ్యాధికార యాత్ర 41వ రోజులో భాగంగా తీన్మార్ మల్లన్న గారు నల్లగొండ నుంచి మునుగోడు వైపు పాదయాత్ర కొనసాగిస్తున్నారు. మార్గమధ్యంలో వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. నల్లగొండ టౌన్ లైబ్రరీ వద్ద కేతేపల్లికి చెందిన విద్యార్థి సాయి మల్లన్నను కలిశారు. మేదరి సామాజికవర్గానికి చెందిన విజయ్ కుమార్ తమ సంప్రదాయ చాటలు అల్లే వృత్తి గురించి వివరించారు. పాతబస్తీలో ఇస్త్రీ దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మణ్, శంకర్, భీమనపల్లి తమ సమస్యలను మల్లన్న దృష్టికి తీసుకువచ్చారు.హౌసింగ్ బోర్డు వద్ద అరటిపండ్ల వ్యాపారులు మల్లయ్య, వెంకటమ్మలను మల్లన్న కలిసి వారి జీవనోపాధి, వ్యాపార సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి వద్ద అరటిపండ్లు కొనుగోలు చేశారు. గుర్రంపోడుకు చెందిన బొడ్డు సతీష్ తనకు ఇల్లు మంజూరు కాకుండా జానారెడ్డి కుమారుడు అడ్డుకుంటున్నారని, తనకు న్యాయం చేయాలని మల్లన్నను కోరారు. నల్లగొండకు చెందిన లింగస్వామి మల్లన్నను శాలువాతో సత్కరించగా, స్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి ప్రవీణ్ కూడా మల్లన్నను కలిసి మద్దతు ప్రకటించారు.నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో బీసీ మహిళా సంధ్య నేతృత్వంలో గ్రామస్తులు హారతులతో మల్లన్నకు ఘనస్వాగతం పలికారు. గణేష్ నేతృత్వంలో యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం గ్రామంలోని బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో మల్లన్న కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ

సందర్భంగా స్థానిక రైతు రాములు మల్లన్నను కలిసి వ్యవసాయ సంబంధిత అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్ర మునుగోడు వైపు కొనసాగుతోంది.

పంకెన గ్రామంలో ఐకెపి వడ్ల కళ్ళం ఏర్పాటు చేయాలి

- రైతుల ఇబ్బందులను పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ మౌర్య డిమాండ్

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని అన్ని గ్రామాలతో పోలిస్తే పంకెన గ్రామంలో వరి సాగు విస్తీర్ణం చాలా ఎక్కువని, ఇక్కడ రైతులు విస్తారంగా వరి పంటను పండిస్తున్నప్పటికీ గ్రామంలో ఒక ఐకెపి వడ్ల కళ్ళం కూడా అందుబాటులో లేకపోవడం శోచనీయమని కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ మౌర్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పంట బాగానే పండుతున్నా, ధాన్యం ఆరబెట్టుకోవడానికి సరైన వసతి లేక అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సరిగ్గా రెండేళ్ల క్రితం గ్రామంలో ఐకెపి కళ్ళం ఉండేదని, అప్పట్లో వరి కోతల సమయంలో రైతులు తమ ధాన్యాన్ని ఆ కళ్ళంలోనే సులభంగా ఆరపెట్టుకునేవారని గుర్తుచేశారు. కానీ, గత సంవత్సరం నుండి ఆ కళ్ళం అందుబాటులో లేకుండా పోవడంతో రైతుల కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. గత ఏడాది కాలంగా కళ్ళం లేక ఇంటి ఆవరణలో, పెరట్లో ధాన్యం ఆరబోయాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు.అకస్మాత్తుగా వర్షం వస్తే ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రోడ్లపై ఆరబోస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసారైనా పంకెన గ్రామంలో ఐకెపి వడ్ల కళ్ళాన్ని మళ్లీ ఏర్పాటు చేస్తే రైతుల తిప్పలు తప్పుతాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంకెన గ్రామంలో తక్షణమే వడ్ల కళ్ళం నిర్మించి, రైతులను ఆదుకోవాలని కిరణ్ మౌర్య రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల జేఏసీ జిల్లా కో కన్వీనర్ దాసరి రమేష్, ఐతే బాపు, వేల్పుల రావణ్ తదితరులు పాల్గొని డిమాండ్ చేశారు.

మేడిగడ్డ కూలిపోయిందనేది కాంగ్రెస్ దుష్ప్రచారం

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం
- కన్నెపల్లి పంపులు వెంటనే ప్రారంభించి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయిందని కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం.. మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్రాణహిత-గోదావరి సంగమ ప్రాంతం, కన్నెపల్లి పంప్ హౌస్ తో పాటు మేడిగడ్డ బ్యారేజ్ ను సందర్శించింది.ఈ సందర్భంగా గోదావరి నీటి ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజ్ వద్ద 85 పిల్లర్లు నిటారుగా క్షేమంగా ఉన్నాయని, కేవలం రెండు మూడు పిల్లర్లకు మాత్రమే మరమ్మతులు అవసరమని ఆయన స్పష్టం చేశారు. కనీసం ఆ మరమ్మతులు కూడా చేపట్టకుండా, ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందంటూ ప్రభుత్వం కావాలనే దుష్ప్రచారం

చేస్తోందని ఆరోపించారు.

రోజుకు 2 టీఎంసీల నీరు వృథా

మేడిగడ్డ వద్ద ప్రస్తుతం సుమారు 22 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని, రోజుకు దాదాపు రెండు టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతోందని ప్రశాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంపులను వెంటనే ప్రారంభించి గోదావరి జలాలను ఎత్తిపోస్తే ఎస్సారెస్పీ, నిజాంసాగర్ తో పాటు మిడ్ మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ వంటి రిజర్వాయర్లను భర్తీ చేయవచ్చని సూచించారు. రోజుకు ఒక టీఎంసీ చొప్పున 90 రోజులు నీటిని ఎత్తిపోస్తే ఎస్సారెస్పీని నింపవచ్చని, రోజుకు అర టీఎంసీ చొప్పున నెలన్నర పాటు పంపింగ్ చేస్తే 18 టీఎంసీల సామర్థ్యం గల నిజాంసాగర్ ను నింపే అవకాశం ఉందని గణాంకాలతో వివరించారు.

రైతులను కాపాడటంలో రేవంత్ ప్రభుత్వం విఫలం

గుత్ప, అలీసాగర్, చౌట్పల్లి హన్మంతరెడ్డి, నవాబు, వేంపల్లి, సారంగాపూర్, మెంట్రాజ్ పల్లి లిఫ్టుల పరిధితో పాటు నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగునీరు అందక లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని భారాస నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పంటలను కాపాడటంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కన్నెపల్లి పంపులను తక్షణమే ప్రారంభించి, వృథాగా పోతున్న గోదావరి జలాలను తెలంగాణ ప్రాజెక్టులకు తరలించాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ నాయకత్వంలో రైతు పోరుబాట

ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీరు విడుదల చేయకపోతే తెలంగాణ రైతాంగం ఆగ్రహానికి గురికాక తప్పదని వేముల హెచ్చరించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతాంగాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితో పాటు మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ విప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, విఠల్ రావు, షేక్ ముజీబుద్దీన్ తదితర బీఆర్ఎస్ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బీరసాగర్ ఇసుక క్వారీ సమీపంలో విషాదం

- గుర్తుపట్టలేని విధంగా మారిన మృతుడి ముఖం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానికుల తీవ్ర ఆగ్రహం

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. మండలంలోని బీరసాగర్ ఇసుక క్వారీ సమీపంలో ఇసుక లారీ ఢీకొనడంతో ఓ ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరసాగర్ క్వారీలో ఇసుక లోడ్ చేసుకున్న ఒక లారీ వేగంగా రోడ్డుపైకి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ద్విచక్ర వాహనదారుడి ముఖం గుర్తుపట్టలేని విధంగా నలిగిపోయింది. క్షణాల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం: స్థానికుల ఆరోపణ

ఈ ప్రమాదానికి ఇసుక క్వారీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్వారీ నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఇసుక లారీలను ఇష్టారాజ్యంగా ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డుపైనే లారీలను నిలపడం వల్ల రాకపోకలు సాగించే వాహనదారులకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని మండిపడుతున్నారు.

అధికారులు స్పందించాలి..

నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్డుపై లారీలను పార్కింగ్ చేస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రహదారిపై లారీల అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలని, తగిన భద్రతా చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

కాషాయ జెండాలతో జనసంద్రంగా మారిన పట్టణం.. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో భారీ ప్రదర్శన.. పాల్గొన్న బీజేపీ

నిర్మల్ నవంబర్ 3 (గాయత్రి న్యూస్)

నిర్మల్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహా పాదయాత్రకు బీజేపీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కాషాయ జెండాలు రెపరెపలాడుతుండగా పట్టణంలోని ప్రధాన వీధులు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ మహా పాదయాత్ర నిర్వహించినట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జులు అభయ్ పాటిల్, రేఖా శర్మ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అలాగే ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సుడిగాలి పర్యటన

- పులివెందులలో కూడా జగన్ కు ఎదురుగాలి, కూటమి హవా కొనసాగుతుంది

(గాయత్రి న్యూస్)

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో వాతావరణం సహకరించడంతో జోరు వాన కురుస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు.ముందుగా కిర్లంపూడిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. జగపతినగరం పంచాయతీ పరిధిలోని ఎంపీటీసీ స్థానాల్లో కూటమి పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

జగపతినగరం ఎంపీటీసీ అభ్యర్థులు:

1. మద్దాల మణికంఠ స్వామి – టీడీపీ 2. పెంటకోట పాప – టీడీపీ 3. చదలవాడ మహాలక్ష్మి బాబి – జనసేన 4. చదరం గోవిందరావు (చంటిబాబు) 5. బర్రె బుల్లి అప్పన్న – టీడీపీ కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామంలో కూటమి పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి గొడుగుల నాగబాబుకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి

గెలిపించాలని ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపైనా, జనసేన అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తుపైనా ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు జ్యోతుల నెహ్రూ విజ్ఞప్తి చేశారు. అలాగే కిర్లంపూడి జడ్పీటీసీ స్థానానికి కూటమి పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తోట రవికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ – రాష్ట్రంలో కూటమి పార్టీల హవా కొనసాగుతోందని, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమని అన్నారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా జగన్‌కు ఎదురుగాలి వీస్తోందని ఎద్దేవా చేశారు.చెప్పాం, చేసాం, చేస్తాం అనే నినాదంతో కూటమి పార్టీలు ఎన్నికలకు వెళ్తే, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని తెలిపారు.కిర్లంపూడి సమగ్ర అభివృద్ధికి రాబోయే రెండున్నర సంవత్సరాల్లో ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తోటగాంధీ, తూము కుమార్, కుర్ల చినబాబు, గుడాలరాంబాబు, కాళ్ల వెంకటేష్,చదలవాడ బాబి, దాడి చిన్న బుజ్జి,జోక శ్రీను, ఆళ్ల బాబులు, కాకిలేటి రాయుడు, కాకిలేటి బుజ్జి, కంద సత్యానందం, జనసేన పార్టీ నాయకులు కాకిలేటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో పొన్నూరు రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన పద్మావతి ఎక్స్‌ప్రెస్

(గాయత్రి న్యూస్)

పొన్నూరు ప్రయాణికులకు అండగా నిలిచిన వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ప్రభావంతో ఒంగోలు వైపు వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు తెల్లవారుజామున 2:30 గంటల నుంచి పొన్నూరు రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది. దీంతో రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలతో ప్రయాణిస్తున్న వారు తాగునీరు, ఆహారం అందక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన పొన్నూరుకు చెందిన స్థానిక స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో స్పందించాయి. వాసవి క్లబ్ పొన్నూరు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు కలిసి

నిలిచిపోయిన రైలులోని ప్రయాణికులకు బిస్కెట్లు, టీ, వాటర్ బాటిళ్లు, వెజ్ బిర్యానీతో పాటు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో వాసవి క్లబ్ పొన్నూరు అధ్యక్షుడు పోలిశెట్టి విజయకుమార్, ఆకు కిషోర్, వంశీకృష్ణ, రేగల శీను, ప్రవీణ్ కుమార్, సుధీర్ తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. తుఫాన్ కారణంగా ప్రయాణంలో చిక్కుకుని ఆకలి, దాహంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు ఆహారం, తాగునీరు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమం ప్రయాణికులకు ఎంతో ఊరటనిచ్చింది. ఆపద సమయంలో స్పందించి సహాయం అందించిన వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యుల సేవలను ప్రయాణికులు అభినందించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని చాటిన పొన్నూరు వాసుల మానవతా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది..

ప్రచారంలో దూసుకెళ్తున్న పుల్లూరు వై యస్ ఆర్ సి పి ఎంపీటీసీ 1 అభ్యర్థి మరీదు వినోద్ గౌడ్

(గాయత్రి న్యూస్)

ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం ప్రచార కార్యక్రమం లో భాగంగా పుల్లూరు ఎంపీటీసీ అభ్యర్థి(1) మరీదు వినోద్ గౌడ్ పుల్లూరు పంచాయతీ శివారు చిలుకూరువారి గూడెం లో ప్రచార కార్యక్రమం లో వైస్సార్సీపీ సీనియర్ నాయకులు అప్పిడి సత్యనారాయణ రెడ్డి చిలుకూరి రామిరెడ్డి మరియు గ్రామస్తులు పొల్గుణ్ణి కార్యక్రమం ని విజయవంతం చేశారు కూటమి ప్రభుత్వాన్ని అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతూ ధర్నాలు చేస్తూ ప్రజల్లో వైస్సార్సీపీనీ సజీవంగా ఉంచిన ధిశాలి.జనతా గ్యారేజ్ సినిమాలో ఒక డైలాగ్ ఉంటుంది " ఊరికి దూరంగా ఉంటామని ఆలోచిస్తున్నారేమో అందరం బళ్ళు బాగా తోలుతాం 10 నిమిషాల్లో ఇక్కడ ఉంటాం" అనే విధంగా అప్పిడి సత్యనారాయణ రెడ్డి కూడా అలానే వచ్చేస్తారు.

వర్షంలోనూ తగ్గని ప్రచార జోరు.

- వెలగలగూడెంలో ప్రజల మద్దతు కోరిన కూటమి అభ్యర్థి ముప్పిడి నాగేశ్వరరెడ్డి.

గాయత్రి న్యూస్

ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం వెలగలగూడెంలో కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రంగాపురం-2 ఎంపీటీసీ కూటమి అభ్యర్థి, మండల ఎంపీపీ అభ్యర్థి ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వర్షంలోనూ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుస్తూ మద్దతు కోరారు. ఈ సందర్భంగా ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా నాగేశ్వరరెడ్డిని పేర్కొంటూ, సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చేబ్రోలు రాజు, రామినేని వీరస్వామి నాయుడు, చేబ్రోలు కృపారాజు, రామినేని వెంకటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, కోన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న, కూటమిబలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిని సూరిశెట్టి రమణ వెల్వడం

గాయత్రి న్యూస్

ఎంపీటీసీ 2 సెగ్మెంట్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం. మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాదు ఆదేశానుసారం ప్రచారం యన్ డి ఎ కూటమి సభ్యులు సూరిశెట్టి రమణ స్థానికంగా ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎన్నికల సందడిని పెంచుతున్నారు. వెల్వడం ఎంపీటీసీ 2వ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతం చేసే దిశగా సూరిశెట్టి రమణ ముందుకు సాగుతున్నారు. జనసేన పార్టీ మరియు కూటమి సభ్యులు వెల్వడం

మైలవరం తెలుగు యువత లంక లితీష్ కి జన్మదిన శుభాకాంక్షలు

గాయత్రి న్యూస్

2019 నుండి నిరంతరం ప్రజల్లో ఉండి తెలుగుదేశం పార్టీ ని, నాయకులను ముందుకు నడిపి, పోరాటాలు చేసి,11 కేసులు పెట్టించుకొని, లాఠీ దెబ్బలు తిని కార్యకర్తలకు అండగాఉంటూ 2024 తెలుగుదేశం పార్టీ అధికారం వచ్చాక గౌరవనీయులు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అడుగుజాడల్లో నడుస్తూ,మైలవరం గ్రామ పెద్దల సూచనలతో ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ నిరంతరం ప్రజల సమస్యలను ఎమ్మెల్యే వసంత దృష్టికి తీసుకెళ్లి సమస్యలు తీరుస్తూ ఒక అన్నగా,తమ్ముడుగ అందరికీ ఆత్మీయుడుగా ఉంటున్న లంక లితీష్ కి జన్మదిన శుభాకాంక్షలు మీరు మీ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాము

తుని, పిఠాపురం మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను తనిఖీ చేసిన కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

గాయత్రి న్యూస్

తుని పట్టణంలోని బ్యాంక్ కాలనీ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ సందర్శించి, కౌంటింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఓట్ల లెక్కింపు ప్రక్రియను, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల పర్యవేక్షణ, అనుమతి లేని వ్యక్తుల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కౌంటింగ్ అనంతరం విజయం సాధించిన అభ్యర్థులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్పులు, ఊరేగింపులు నిర్వహించడానికి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతించరాదని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ర్యాలీలు నిర్వహించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్పీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, పెద్దాపురం డిఎస్పీ ఎబిజి తిలక్, కాకినాడ డిఎస్పీ ఎన్ ఎస్ వి కె దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రిగ్గింగ్‌లు, దౌర్జన్యాలతో గెలిచిన దాన్ని గెలుపు అంటారా?

- చిలకలూరిపేటలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన టీడీపీ
- మాజీ మంత్రి విడదల రజిని

గాయత్రి న్యూస్

చిలకలూరిపేటలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ సాగించిన అరాచకాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చగా మారాయని మాజీ మంత్రి విడదల రజిని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌ల ఆక్రమణలు, రిగ్గింగ్‌లు, దొంగ ఓట్ల ఆరోపణలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన టీడీపీ శ్రేణులు, కౌంటింగ్ రోజు కూడా కౌంటింగ్ ఏజెంట్లపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ తమ అరాచకాన్ని కొనసాగించాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల రోజు ఓట్లపై దాడి.. కౌంటింగ్ రోజు ప్రజాస్వామ్యంపై దాడి! ఇదేనా తెలుగుదేశం పార్టీ చెప్పే ప్రజాస్వామ్యం? ఇష్టానుసారంగా రిగ్గింగ్‌లు చేసుకుని, కౌంటింగ్ కేంద్రాలను ఆక్రమించి, కౌంటింగ్ ఏజెంట్లపై దాడులు చేస్తూ, తమకు నచ్చిన ఫలితాలను ప్రకటించుకుంటే దానిని ప్రజా విజయమని ఎలా చెప్పుకుంటారని విడదల రజిని ప్రశ్నించారు. ప్రత్తిపాటి పుల్లారావు అనుచరులు కౌంటింగ్ కేంద్రాల వద్ద దౌర్జన్యాలకు పాల్పడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లను అడ్డుకోవడం, వారిపై దాడులు చేయడం వంటి ఘటనలు ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన బాధ్యతను విస్మరించి, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి రాజకీయ ఆధిపత్యం ప్రదర్శించాలనుకోవడం అధికార అహంకారానికి పరాకాష్ట అని విమర్శించారు. చిలకలూరిపేట రాజకీయాల్లో టీడీపీ ఒక విష సంస్కృతిని తీసుకొచ్చింది. ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాల్సింది పోయి, భయపెట్టడం, దాడులు చేయడం, ప్రత్యర్థుల గొంతు నొక్కడం ద్వారా గెలవాలనుకోవడం సిగ్గుచేటు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. కానీ ప్రజల తీర్పును గౌరవించకుండా, ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మలుచుకోవాలనే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని విడదల రజిని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో జరిగిన దాడులు, దౌర్జన్యాలపై ఎన్నికల అధికారులు తక్షణమే స్పందించాలని, జరిగిన ఘటనలను సమగ్రంగా పరిశీలించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

ప్రతి చుక్క అమూల్యం.. నీటిని ఆదా చేద్దాం భవిష్యత్తును కాపాడుదాం

- ఘనంగా నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం

గాయత్రి న్యూస్

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కనిగిరి ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ మహమ్మద్ సయాన బేగం ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బందికి, ప్రయాణికులకు నీటి పొదుపుపై ఈ రోజు నీటిని ఆదా చేద్దాం రేపటి తరాల చిరునవ్వును కాపాడుదాం అని సిబ్బందికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రతి నీటి చుక్క ఎంతో విలువైనదని నీరు ఉంటేనే జీవం నీరు ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. నీటి వృథాను అరికట్టి, అవసరమైనంత మాత్రమే వినియోగించాలని సిబ్బందికి సూచించారు. డిపో పరిసరాల్లో నీటి లీకేజీలను గుర్తించిన వెంటనే మరమ్మతులు చేయాలని ఉపయోగించిన నీటిని వీలైనంత వరకు పునర్వినియోగించుకోవాలని సూచించారు. స్నానానికి షవర్‌కు బదులుగా బకెట్‌ను ఉపయోగించడం, మొక్కలకు నీటిని పొదుపుగా అందించడం వంటి అలవాట్లను పాటించాలని తెలిపారు. మన డిపో మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, నీటిని ఆదా చేయడం ద్వారా భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, ఆర్ టి సి సూపర్ వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్స్ గ్యారేజ్ సిబ్బంది, జి. హెచ్. ఎఫ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

- కనిమెర్ల, పోరాటనగర్ గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్ ప్రజలతో శాంతి ప్రతిజ్ఞ

గాయత్రి న్యూస్

మైలవరం పోలీస్ స్టేషన్ ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భరోసా కల్పించేందుకు ఈరోజు సాయంత్రం కనిమెర్ల, పోరాటనగర్ గ్రామాల్లో మైలవరం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ బాబు కొట్టూరి, మైలవరం ఎస్ఐ కె. సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఫ్లాగ్ మార్చ్ అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అధికారులు ప్రజలకు ఎన్నికల నియమావళిని వివరించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎటువంటి అల్లర్లు, గొడవలు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని, ఇతరులను బెదిరించడం లేదా ఓటు హక్కు వినియోగానికి ఆటంకం కలిగించడం చేయరాదని స్పష్టం చేశారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ కింద ఉత్తర్వులు అమల్లో ఉన్నాయని అధికారులు గుర్తుచేశారు. ఎన్నికల నియమావళిని, అమలులో ఉన్న ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం, ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా, పరస్పర గౌరవంతో మెలుగుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరిస్తాం అని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఎన్నికైన అభ్యర్థులకు డిక్లరేషన్ పత్రాలు అందజేసిన ఎన్నికల అధికారులు

గాయత్రి న్యూస్

కనిగిరి మున్సిపల్ ఎన్నికల్లో 6వవార్డ్ 29వ వార్డుల్లో ఎన్నికైన మున్సిపల్ అభ్యర్థులకు ఆయా ఎన్నికల అధికారులు మంగళవారం డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. కనిగిరి మున్సిపాలిటీలు 32 వార్డులు ఉండగా 30 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవం కానీ 6వ 29వ వార్డులకు ఈ నెల 1న ఎన్నికలు నిర్వహించగా, మంగళవారం స్థానిక ఏఎంసీలో 6వ 29వ వార్డులకు కౌంటింగ్ నిర్వహించారు. 29వ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఓబులశెట్టి ధనలక్ష్మి 537 ఓట్ల మెజారిటీతో విజయం సాధించగా, 6వ వార్డు తెలుగుదేశం పార్టీ

అభ్యర్థి ఒంటిపెంట శ్రీరాముల రెడ్డి 363 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 29వ వార్డులో, 6వ వార్డులో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఓబులశెట్టి ధనలక్ష్మికి, ఒంటిపెంట శ్రీరాముల రెడ్డికి మున్సిపల్

కమిషనర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి శ్రీధర్, ఎన్నికల అధికారులు కలవ విజయలక్ష్మి డిక్లరేషన్ ఫారమ్స్ అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

శ్రీ వడ్డి పోలమాంబ అమ్మవారి దివ్య ఆశీస్సులు ఉండాలి

- మల్లాడి రాజేంద్ర

గాయత్రి న్యూస్

కాకినాడ నగరంలోని జగన్నాధపురం 29వ డివిజన్ రెల్లి వీధిలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ వడ్డి పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా జనసేన పార్టీ కాకినాడ సిటీ నాయకులు మల్లాడి రాజేంద్ర ప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాడి రాజేంద్ర మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఎంతో ఇష్టమైన రెల్లి కులస్తులు బాగా అభివృద్ధి చెందాలని తమ పార్టీ ఎప్పుడూ కోరుకుంటుందన్నారు. జాతర మహోత్సవాల నిర్వహణకు జనసేన పార్టీ తరఫున రెల్లి కుల పెద్దలకు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జాతర మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో బండి లక్ష్మీనారాయణ, గబ్బర్‌లతో పాటు కూటమి నాయకులు ముత్యాల అనిల్ కుమార్, దళాయి అరుణ్ కుమార్, ముత్యాల దేవరాజు తదితర నాయకులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన వరి పైరు

- నేమలిపురి పాలాల్లో పర్యటించిన వ్యవసాయాధికారులు

గాయత్రి న్యూస్

మండల పరిధిలోని నేమలిపురి గ్రామంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మరియు ఈదురుగాలులకు వరి పైరు నేలకొరిగింది. ఈ విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి పి. వెంకట నర్సయ్య మరియు జిల్లా వ్యవసాయాధికారి ఎం. జగ్గారావు నేడు పొలాలను సందర్శించారు.

అధికారుల సూచనలు:

1. పాలు పోసుకునే దశలో ఉన్న పైరును వెంటనే పైకి లేపి చిన్న చిన్న కట్టలుగా కట్టుకోవాలి. లేకపోతే గింజలు పాలు సరిగా పోసుకోవు, కంకులు కుళ్ళిపోయే ప్రమాదం ఉంది. 2. కోతకు సిద్ధంగా ఉన్న ముదురు పైరుకు: గింజ రాలిపోకుండా, గట్టిపడటానికి 3% ఉప్పు ద్రావణం (10 లీటర్ల నీటికి 300

గ్రా. ఉప్పు) పిచికారీ చేయాలి. దీనివల్ల తేమ శాతం తగ్గి బరువు పెరుగుతుంది.రైతులు అధైర్యపడవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని నివారించవచ్చని అధికారులు తెలిపారు. ఈ సందర్శనలో గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి మండలంలో హైపర్ ఆది రోడ్‌షో.. కూటమి అభ్యర్థులకు ఓటేయాలని విజ్ఞప్తి

గాయత్రి న్యూస్

భారీ వర్షాలు, ఈదురుగాలులను సైతం లెక్కచేయకుండా జబర్దస్త్ ఫేమ్ సినీ హాస్య నటుడు హైపర్ ఆది కలిదిండి మండలంలో మంగళవారం ఎన్నికల రోడ్ షో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం, బీజేపీ కూటమి బలపరిచిన జనసేన కలిదిండి మండల జడ్పీటీసీ అభ్యర్థి నల్లగోపుల వెంకట చలపతిరావు (నాని), కలిదిండి ఎంపీటీసీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కైకలూరు ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ మద్దతుతో నిర్వహించిన ఈ రోడ్ షో ప్రచారం కలిదిండి మండలంలోని పలు గ్రామాలు, ప్రధాన కూడళ్ల మీదుగా ఉత్సాహంగా సాగింది. మొదటిగా చిట్టూరి పరశురామయ్య ఇంటి వద్ద ప్రారంభమైన రోడ్‌షో గుర్వాయిపాలెం, కోట కలిదిండి, కలిదిండి, ఎస్.ఆర్.పి. అగ్రహారం, సానారుద్రవరం మీదుగా కోరుకొల్లు బస్టాండ్ సెంటర్‌లో హైపర్ ఆది మాట్లాడుతూ, "జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులైన నల్లగోపుల వెంకట చలపతిరావు (నాని), ఎంపీటీసీ అభ్యర్థులకు మీ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించి, వారి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని విజ్ఞప్తి చేశారు. తనదైన కామెడీ టైమింగ్, చురుకైన ప్రసంగంతో ప్రజలను ఆకట్టుకుంటూ అభ్యర్థుల విజయానికి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురుసు' తుఫాను కారణంగా వర్షాలు, బలమైన గాలులు వీస్తున్నప్పటికీ ప్రచారాన్ని కొనసాగించి కోరుకొల్లు గ్రామంలో ముగించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి అభ్యర్థి నల్లగోపాల చలపతి తో పాటు కోరుకొల్లు సెగ్మెంట్- 1 జనసేన, టిడిపి అభ్యర్థులైన నూకల శ్రీనివాసరావు, తలారి నాగరాజులకు ఓట్లు వేసి గెలిపించాలని పేర్కొన్నారు. శాసనమండలి సభ్యులు

జయమంగళ వెంకటరమణ, జడ్పీటీసీ అభ్యర్థి నల్లగోపుల వెంకట చలపతిరావు (నాని), కలిదిండి ఎంపీటీసీలు అభ్యర్థులు, కోరుకొల్లు ఎంపీటీసీ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మురసు తుపాను.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గాయత్రి న్యూస్

తిరువూరు: మురసు తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లా తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్డీఓ ఏ. కుమార్ పలు చెరువులు, అలుగు పారుతున్న వాగులను పరిశీలించారు. అనంతరం వారు ఇరిగేషన్, ఫైర్ సేఫ్టీ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే గుర్తించి, అవసరమైతే సురక్షిత, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

కె. జి బి వి పాఠశాలలోపి ఈ టి ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

గాయత్రి న్యూస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీఈటి ఉద్యోగానికి తాత్కాలిక ప్రాతిపదికన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ నియామకం.మా విద్యా సంస్థలో ఖాళీగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పిఈటి,పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హత మరియు ఆసక్తి గల మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఒక ప్రకటనలు తెలిపారు ఎంపికైన అభ్యర్థి విద్యార్థులకు శారీరక విద్య, క్రీడలు, వ్యాయామం మరియు యోగా తదితర అంశాలలో శిక్షణ అందించాల్సి ఉంటుంది. అలాగే విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించే బాధ్యతలను,నిర్వహించాల్స ఉంటుంది.పోస్టు పేరు: ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పిఈటి ఖాళీల సంఖ్య 01ఉద్యోగ స్వభావం తాత్కాలిక నియామకం,అర్హత ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సంబంధిత విద్యార్హత కలిగి ఉండాలి.అనుభవం ఉన్న మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.దరఖాస్తు చివరి తేదీ 04-11-2026 నుండి 06-11-2026 వరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్:9963655142 ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థులు తమ బి పి ఈ డి విద్యార్హతల ధ్రువపత్రాలు,బయోడేటాతో సంప్రదించాలని ఆమె కోరారు

రైతులు అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఏఎంసీ చైర్మన్ మహేశ్ రెడ్డి

గాయత్రి న్యూస్

ముస్తాబాద్ మండలంలో నిన్న కురిసిన అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏం సి చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.ధాన్యం రంగు మారినప్పటికీ రైతులు ఆందోళన చెందవద్దు అలాంటి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది ఇప్పటికే చాలా సెంటర్లలో వడ్ల కొనుగులు ప్రక్రియను ప్రారంభించాం ఇది రైతు ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనా ప్రజా ప్రభుత్వం ఆశయ సాధనకు కృషి చేస్తున్నారని రైతుల కష్టాలను రాజకీయాలకు వాడుకుంటూ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని,మాయ మాటలను రైతులు నమ్మవద్దు రైతులకు నష్టం జరగకుండా ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది వారన్నారు

గుడి చెరువు ఫీడర్ ఛానల్ మరమ్మతులకు రూ.8.24 లక్షలు మంజూరు

- గ్రామ అభివృద్ధికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సర్పంచ్ సంగం అర్పిత రెడ్డి కృతజ్ఞతలు

గాయత్రి న్యూస్

మల్లారం: వేములవాడ గ్రామీణ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజన్న గుడి చెరువు ఫీడర్ ఛానల్ మరమ్మతుల కోసం రూ.8,24,000 నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మల్లారం సర్పంచ్ సంగం అర్పిత రెడ్డి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, సాగునీటి వసతుల మెరుగుదలకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మంజూరైన నిధులతో ఫీడర్ ఛానల్ మరమ్మతులు చేపట్టడం వల్ల రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని, వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రుద్రవరంలో గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన

- హాజరైన జిల్లా, మండల అధికారులు

గాయత్రి న్యూస్
వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం సభ నిర్వహించారు. సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులకు బరువు, ఎత్తు, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో కీర్తన పాల్గొన్నారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించే విధానాన్ని అధికారులు పరిశీలించారు. అంగన్వాడీ సూపర్వైజర్ శశి కిరణ్మయి, టీచర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

లారీ నుంచి జారిపడ్డ భారీ ప్రొక్లైన్.. ఊపిరి పీల్చుకున్న స్థానికులు

- గొల్లపల్లి బస్టాండ్ వద్ద తృటిలో తప్పిన పెను ప్రమాదం
- కదులుతున్న లారీ నుంచి కిందపడ్డ ఎక్స్‌కవేటర్: క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు

గాయత్రి న్యూస్
ఎలారెడిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ వద్ద ఘోర ప్రమాదం తృటిలో తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక కదులుతున్న లారీలో తరలిస్తున్న భారీ ప్రొక్లైన్ ఎక్స్‌కవేటర్ ప్రమాదవశాత్తు ఒక్కసారిగా రోడ్డుపైకి జారిపడింది. నిత్యం ప్రయాణికులు, వాహన రాకపోకలతో రద్దీగా ఉండే బస్టాండ్ ఆవరణలో ఈ ఘటన జరగడంతో అక్కడున్న ప్రయాణికులు, పాదచారులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ప్రొక్లైన్ కిందపడే సమయానికి దానికి సమీపంలో వాహనాలు గానీ, ప్రయాణికులు గానీ లేకపోవడంతో పెను ముప్పు తప్పినట్లయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అక్కడ ఉన్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు. భారీ యంత్రాలను వాహనాల్లో తరలించేటప్పుడు సంబంధిత డ్రైవర్లు, యజమానులు సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

వేములవాడలో గుండెపోటుతో లారీ డ్రైవర్ ప్రెసిడెంట్ మృతి

గాయత్రి న్యూస్
వేములవాడ పట్టణంలోని 4వ వార్డుకు చెందిన అన్నారపు ఇస్తారి (65) గుండెపోటుతో మృతి చెందారు. మహాలక్ష్మి విధి ప్రాంతానికి చెందిన ఇస్తారి లారీ డ్రైవర్‌గా పనిచేస్తు లారీ డ్రైవర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్నారు. మంగళవారం గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఇస్తారి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆయన మృతి పట్ల స్థానికులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. నేడు అంతక్రియలు జరుగుతున్నాయి.

5

నక్కవాగులో ఇద్దరు గల్లంతు : దగ్గరుండి గాలింపు చర్యలు చేపట్టిన ప్రత్తిపాటి

- యడ్లపాడు తిమ్మాపురం మధ్య జాతీయ రహదారిపై చేరిచిక్కుకున్నవారి

గాయత్రి న్యూస్
మురస తుఫాన్ తీవ్రతతో మంగళవారం నియోజకవర్గవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద నక్కవాగు వరద జాతీయ రహదారిపైకి చేరింది. రహదారిపై ప్రయాణిస్తున్నకారు, ద్విచక్రవాహనం నీటి ప్రవాహంలో అదుపు తప్పికొట్టుకుపోయాయి. సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ప్రత్తిపాటి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. రెవెన్యూ,పోలీస్ సిబ్బంది సాయంతో పరిస్థితిని సమీక్షించి, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఎన్.డీ.ఆర్.ఎఫ్ బృందాలను రప్పించి దగ్గరుండి గాలింపు చర్యలు చేపట్టారు. ఒకవైపు జోరున వర్షం పడుతున్నా పరిస్థితిని సమీక్షిస్తూ, ప్రత్తిపాటి ఎన్.డీ.ఆర్.ఎఫ్, పోలీస్ బృందాల సమన్వయంతో గాలింపు చర్యలు తీవ్రతరం చేశారు, భారీ వర్షం, వరద ప్రవాహం పెరగడం. చీకటి కావడంతో గాలింపుకు ఇబ్బందిగా ఉందని అధికారులు ప్రత్తిపాటికి తెలిపారు. రాత్రి వేళలోనూ వాగుకు ఇరువైపులా గాలించాలని, గల్లంతైన వారు ఎక్కడో ఒకచోట చిక్కుకుపోయి ఉండొచ్చని ప్రత్తిపాటి సూచించారు. దాంతో అధికారులు తిరిగి వెతుకులాట కొనసాగించారు. కానీ గల్లంతైన వారి ఆచూకీ లభించలేదు. ఘటనా ప్రదేశానికి చేరుకున్న వెంటనే తాలుత వాహనదారుల గల్లంతుపై ప్రత్తిపాటి గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కారులో ఉన్న నలుగురు, బైక్ పైఉన్న ముగ్గురు మొత్తం ఏడుగురు నీటిలో కొట్టుకుపోయారని, తాళ్లసాయంతో 5 గురిని కాపాడామని, కారులోని ఒకరు.. బైక్ పై ఉన్న ఒకరు వరదలో గల్లంతయ్యారని గ్రామస్తులు ప్రత్తిపాటికి తెలిపారు. వెంటనే స్పందించి వరదలో చిక్కుకున్నవారిని కాపాడిన గ్రామస్థుల్ని ఈ సందర్భంగా ప్రత్తిపాటి అభినందించారు. మురసా తీవ్రప్రభావంతో చిలకలూరిపేటలో భారీ వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం ఉదయం నుంచి జిల్లా కలెక్టర్, ప్రధానాధికారులతో మాట్లాడుతూ, పరిస్థితిని సమీక్షించిన ప్రత్తిపాటి మురసా తీవ్రత ధాటికి చిలకలూరిపేట నియోజకవర్గవ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రినుంచే వర్షం, గాలి ప్రారంభం కావడంతో పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది, దీంతో మంగళవారం ఉదయం నుంచే ప్రత్తిపాటి అధికారులతో మాట్లాడి, ప్రజలకు ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టారు. అధికారులకు సూచనలు ఇస్తూనే, మరోవైపు టీడీపీ నాయకులు, కార్యకర్తల సాయంతో తుఫాను ప్రభావంతో నీటమునిగిన పలువార్డులు, గ్రామాల్లో ఆహారం, వసతి ఏర్పాట్లు చేయించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, రెవెన్యూ, మున్సిపల్, వైద్యవిభాగం, పోలీస్ అధికారులతో మాట్లాడిన ప్రత్తిపాటి ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది

లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వార్డుల్లో పర్యటించిన ప్రత్తిపాటి, నీటమునిగిన కాలనీలు, లోతట్లు ప్రాంత ప్రజల్ని సురక్షిత కేంద్రాలకు తరలించాలని అధికారుల్ని ఆదేశించారు, వర్షం తగ్గాక వెంటనే కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వ్యర్థాలను తొలగించాలని, రోడ్లపైన నీరు లేకుండా చూడాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లోని వారికి భోజన సదుపాయాలు కల్పించి, వసతి ఏర్పాటు చేయాలని పట్టణ నాయకులు, కార్యకర్తలకు ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలు ముమ్మరం చేయాలని, విద్యుత్ శాఖ ఏఈని ఆదేశించారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేసి, వీలైనంత వేగంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. పట్టణంలో సహాయక చర్యల్లో నిమగ్నమై ఉండగానే నక్కవాగులో వాహనదారులు గల్లంతైన సమాచారం తనకు తెలియడంతో ప్రత్తిపాటి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన

- పంట మార్పిడి, నీటి పొదుపుపై సర్పంచ్ ముత్త సంజన మహేష్ సూచనలు

గాయత్రి న్యూస్
వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో పంటలకు కలిగే నష్టాలను తగ్గించి, రైతులు మెరుగైన వ్యవసాయ పద్ధతులు అవలంబించాలనే లక్ష్యంతో చంద్రగిరి గ్రామంలో సర్పంచ్ ముత్త సంజన మహేష్ అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట మార్పిడి, యాంత్రీకరణ, భూతి బచావో అభియాన్ పథకాలపై అధికారులు వివరించారు. ఎంపీడీఓ బింగి కీర్తన, ఎంఆర్ఓ జయంత్ మాట్లాడుతూ ఇంకుడు గుంతలు,

ఫామ్ పాండ్స్, బోర్‌వెల్ రీఛార్జ్ ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ ఏఈ సూచించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ పంట మార్పిడి, అంతర పంటల సాగు విధానాలను వివరించారు. సర్పంచ్ ముత్త సంజన మహేష్ మాట్లాడుతూ రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, అధికారుల సూచనల మేరకు సాగు చేపట్టాలని అన్నారు. నీటి వనరులను సంరక్షించుకుంటూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈర్నాల రాజు, జీపీఓ మల్లీశ్వరి, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి నిట్టు నరేష్, అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

7

వెల్జీపురంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- దళారులను నమ్మి మోసపోవద్దు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

గాయత్రి న్యూస్
రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. వెల్జీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ ఉట్కూరు వెంకటరమణారెడ్డి, గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, ఫ్యాక్స్ డైరెక్టర్ గుండా వెంకటేశం, ఏపీఎం కుమారస్వామి, రామచంద్రారెడ్డి, వార్డు సభ్యులు బొజ్జ శ్రీనివాస్, సంగెం ముత్తవ్వ, వెలిచాల భారతి శ్రీనివాస్, వేములవాడ భారతి రాజేశం, పాలకేంద్రం

చైర్మన్ మూల బాల్ రెడ్డి, వీఓ అధ్యక్షురాలు ఓరెమ్ రూప, భార్గవ్ రెడ్డి, సీఏ కంకణాల కరుణ, శ్రీనివాస్ రెడ్డి, హమాలీ సంఘం అధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లారం పరశురాములు, వేములవాడ రమణాచారి, గుండ శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- పిల్లలకు పోషకాహారం అందించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

గాయత్రి న్యూస్
పిల్లలకు పోషకాహారం అందించి, ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. మానాల అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల కార్యక్రమాన్ని ప్రారంభించి, పిల్లల ఎత్తు, బరువు, కేంద్రంలోని వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత ఉన్న మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఎదుగుదల లోపాలున్న పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సర్పంచ్ శంకర్, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్దులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు..

- పార్టీ అనుబంధమే ప్రాతిపదికా అర్హతలే కొలమానమా
- ఇల్లు లేని కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే ఏదీ
- లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరపాలి
- మంత్రి శ్రీధర్ బాబు స్పందించాలి.. అర్హులకు న్యాయం చేయాలి

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లిలో ఓవైపు పక్కా ఇల్లు లేక టార్పాలిన్ల కిందే కాలం వెళ్లదీస్తున్న నిరు పేద కుటుంబాలు.. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల కోసం అశగా ఎదురుచూస్తున్న అర్హులు! సొంతింటి కల నెరవేరుతుందన్న నమ్మకంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న పేదలకు లబ్ధిదారుల ఎంపికపై వినిపిస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇల్లు లేని కుటుంబాల పరిస్థితి ఏమిటి దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ న్యాయం జరుగుతోందా లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ప్రాధాన్యానికి తావుందా అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్దులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

టార్పాలిన్ల కిందే కాపురం!

మద్దులపల్లిలో పక్కా ఇళ్లు లేక టార్పాలిన్లు కప్పుకొని తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్న నిరుపేద కుటుంబాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి పనులపై ఆధారపడి జీవించే కుటుంబాలకు సొంతంగా ఇల్లు నిర్మించుకోవడం ఆర్థికంగా భారంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకమే తమకు భరోసా ఇస్తుందని ఆశిస్తున్నారు. అయితే, అర్హతలు ఉన్నప్పటికీ తమకు ఇల్లు మంజూరవుతుందో లేదోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. ఇల్లు లేని కుటుంబాల వాస్తవ పరిస్థితులను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలిస్తేనేసమస్య తీవ్రత స్పష్టమవుతుంది.

ఎంపికలో రాజకీయ పక్షపాతమా

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలకు చెందినవారికి ఇళ్లు మంజూరు చేసే విషయంలో ముందుగా పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే పరిశీలిస్తామంటూ కొందరు చెబుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ లేదు. వాటిలో వాస్తవాలను తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా నిర్దేశిత మార్గదర్శకాలు, అర్హతల ఆధారంగా అమలవుతున్నాయా లేదా అన్నది పరిశీలించాలి. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అర్హులైన ఏ కుటుంబానికీ అన్యాయం జరగకుండా చూడాలి.

క్షేత్రస్థాయి విచారణే కీలకం!

మద్దులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పక్కా ఇల్లు లేక టార్పాలిన్ల కింద నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని అధికారులు స్వయంగా పరిశీలించాలి. దరఖాస్తుల సంఖ్య, అర్హతల నిర్ధారణ, ఎంపికైన లబ్ధిదారుల వివరాలు, ఎంపికకు అనుసరించిన ప్రమాణాలను సమీక్షించాలి. అర్హులైనప్పటికీ జాబితాలో చోటు దక్కని కుటుంబాలు ఉంటే అందుకు కారణాలను తెలుసుకోవాలి. క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేస్తేనే అర్హులెవరు అన్నది స్పష్టమవుతుంది. ఊహాగానాలకు తావులేకుండా వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మంత్రి శ్రీధర్ బాబు దృష్టి సారించేనా

మద్దులపల్లిలో నిరుపేద కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇళ్ల సమస్యపై మంత్రి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. టార్పాలిన్ల కింద నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని తెలుసుకొని, అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికపై వస్తున్న ఆరోపణలను పరిశీలించి, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూడాలని కోరుతున్నారు.

అధికారుల స్పందన ఏది

మద్దులపల్లిలో ఇళ్ల సమస్యపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది. గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, ఇల్లు లేని నిరుపేద కుటుంబాల వివరాలను సేకరించాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకం మార్గదర్శకాల ప్రకారం అర్హతలను పరిశీలించి, ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలి. ఫిర్యాదులు అందితే వాటిని పరిశీలించి, విచారణలో వెల్లడైన అంశాలను ప్రజలకు తెలియజేయాలి. పేదలకు పక్కా ఇల్లు కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యం. ఆ లక్ష్యం నెరవేరాలంటే అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరగాలి. మద్దులపల్లిలో టార్పాలిన్ల కిందే బతుకులు వెళ్లదీస్తున్న నిరుపేదల పరిస్థితిపై అధికారులు. స్పందించి, వాస్తవాలను వెలికితీసి, అర్హులకు న్యాయం చేస్తారా అన్నది వేచి చూడాలి.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద భారీ పోలీసు బందోబస్తు

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం పరిధిలోని మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీ వద్ద మంగళవారం ఉదయం నుంచే తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన భారత్ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు నేడు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు.బీఆర్ఎస్ నేతల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తుగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్యారేజీ పరిసరాల్లో అదనపు బలగాలను రంగంలోకి దించి నిఘాను ముమ్మరం చేశారు.బ్యారేజీ వైపు వచ్చే ప్రతి వాహనాన్ని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తూ క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. బీఆర్ఎస్ నేతల పర్యటన నేపథ్యంలో బ్యారేజీ వద్ద ఏం జరగబోతుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మృతుడు మహాదేవపూర్‌కు చెందిన స్వామిగా గుర్తింపు

మహాదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

మండల పరిధిలోని బీరసాగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. ఇసుక లారీ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని మహాదేవపూర్ మండలం కేంద్రానికి చెందిన పోత పెద్దోళ్ల స్వామి (46)గా పోలీసులు నిర్ధారించారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి వారు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను తీవ్రంగా చలించిపోయేలా చేసింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యల కోసం దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

కాటారంలో పెట్రోల్ బంకుల మాయాజాలం: కొలతల్లో మోసాలు.. నాణ్యతలో కల్తీ!

- అధికారులు పర్యవేక్షించకపోవడంపై వాహనదారుల ఆగ్రహం
- ఆకస్మిక తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని కొన్ని పెట్రోల్ బంకులు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. వినియోగదారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని బంకుల యాజమాన్యాలు కొలతల్లో మాయాజాలం సృష్టిస్తూ, నాణ్యత లేని ఇంధనాన్ని విక్రయిస్తూ అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిఘా లోపం, తూతూమంత్రంగా సాగుతున్న తనిఖీల కారణంగా ఇక్కడి బంకుల యాజమాన్యాలకు 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా వ్యాపారం సాగుతోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మైలేజ్ రాదు.. పెట్రోల్లో నీళ్లు!

ఇటీవల మండలంలోని ఓ పెట్రోల్ బంకులో ఓ వాహనదారుడు డీజిల్ పోయించుకుని వరంగల్‌కు బయలుదేరాడు. అయితే, మార్గమధ్యంలోనే ఇంధనం అయిపోవడంతో సదరు వాహనదారుడు తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యాడు. పోయించిన డీజిల్‌కు కనీస మైలేజ్ కూడా రాకపోవడం ఇక్కడి కొలతల్లో జరుగుతున్న మోసానికి అద్దం పడుతోంది.ఇదిలా ఉండగా, మరో బంకులో ఘోరం వెలుగుచూసింది. ఓ వాహనదారుడు అనుమానంతో తన వాహనం ట్యాంక్ తెరిచి చూడగా, పెట్రోల్‌లో భారీగా నీరు కలవడాన్ని గమనించి షాక్‌కు గురయ్యాడు. దీనిపై సదరు వాహనదారుడు బంక్ సిబ్బందిని నిలదీయగా, వారు కనీసం పట్టించుకోకుండా బాధ్యతారహితంగా, నిర్లక్ష్య సమాధానాలు చెప్పడం గమనార్హం.

అధికారుల కనుసన్నల్లోనే మేనేజ్

ఈ ప్రాంతంలో లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతల శాఖ) అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, వారు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఇతర అధికారులు ఎవరైనా తనిఖీలకు వస్తున్నారనే సమాచారం ఉంటే.. బంక్ యాజమాన్యాలకు ముందస్తుగానే 'సమాచారం' అందుతోందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీంతో వారు అన్నిటినీ మేనేజ్ చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా పబ్బం గడుపుకుంటున్నారని వాహనదారులు మండిపడుతున్నారు.

స్పందించాలి.. చర్యలు తీసుకోవాలి

ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కాటారం మండలంలోని పెట్రోల్ బంకుల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. కల్తీ ఇంధన విక్రయాలకు, కొలతల మోసాలకు పాల్పడుతూ వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్న బంక్ యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కొనసాగుతున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర

- నల్లగొండ నుంచి మునుగోడు వైపు బీసీ రాజ్యాధికార యాత్ర
- సంప్రదాయ వృత్తిదారులు, చిరు వ్యాపారులు, రైతులు, యువకులతో ముచ్చట

మహదేవపూర్, నవంబర్ 03 (గాయత్రి న్యూస్)

బీసీ రాజ్యాధికార యాత్ర 41వ రోజులో భాగంగా తీన్మార్ మల్లన్న గారు నల్లగొండ నుంచి మునుగోడు వైపు పాదయాత్ర కొనసాగిస్తున్నారు. మార్గమధ్యంలో వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. నల్లగొండ టౌన్ లైబ్రరీ వద్ద కేతేపల్లికి చెందిన విద్యార్థి సాయి మల్లన్నను కలిశారు. మేదరి సామాజికవర్గానికి చెందిన విజయ్ కుమార్ తమ సంప్రదాయ చాటలు అల్లే వృత్తి గురించి వివరించారు. పాతబస్తీలో ఇస్త్రీ దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మణ్, శంకర్, భీమనపల్లి తమ సమస్యలను మల్లన్న దృష్టికి తీసుకువచ్చారు.హౌసింగ్ బోర్డు వద్ద అరటిపండ్ల వ్యాపారులు మల్లయ్య, వెంకటమ్మలను మల్లన్న కలిసి వారి జీవనోపాధి, వ్యాపార సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి వద్ద అరటిపండ్లు కొనుగోలు చేశారు. గుర్రంపోడుకు చెందిన బొడ్డు సతీష్ తనకు ఇల్లు మంజూరు కాకుండా జానారెడ్డి కుమారుడు అడ్డుకుంటున్నారని, తనకు న్యాయం చేయాలని మల్లన్నను కోరారు. నల్లగొండకు చెందిన లింగస్వామి మల్లన్నను శాలువాతో సత్కరించగా, స్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి ప్రవీణ్ కూడా మల్లన్నను కలిసి మద్దతు ప్రకటించారు.నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో బీసీ మహిళా సంధ్య నేతృత్వంలో గ్రామస్తులు హారతులతో మల్లన్నకు ఘనస్వాగతం పలికారు. గణేష్ నేతృత్వంలో యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం గ్రామంలోని బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో మల్లన్న కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు రాములు మల్లన్నను కలిసి వ్యవసాయ సంబంధిత అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్ర మునుగోడు వైపు కొనసాగుతోంది.

1

భోగి వేడుకలతో ప్రారంభమైన దండారీ ఉత్సవాలు

- ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పూజలు
- బజార్‌హత్నూర్ మండలం చింతలసాంగ్వీలో ఘనంగా భోగి పండుగ

బజార్ హత్నూర్: (గాయత్రి న్యూస్)

మండల పరిధిలోని చింతలసాంగ్వి గ్రామంలో ఆదివాసీలు భోగి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకతో దీపావళి పండుగ వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఆదివాసీ పటేల్ ఇంటి అంగణంలో సంప్రదాయ వాద్య పరికరాలైన పర, వెట్టె, గుస్సాడి టోపీలు, కోడల్, తుడుం, డప్పులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇల్లు నుంచి మహిళలు నైవేద్యాలను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో దేవుళ్లకు సమర్పించారు. ఈ రోజు నుంచే ప్రతిష్టాత్మక దండారీ ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. దండారీ వేడుకల్లో భాగంగా యువకులు, గిరిజనులు గుస్సాడి, గుమ్మేల పోరి వేషధారణలు ధరించి నృత్యాలు చేస్తారని గ్రామస్థులు తెలిపారు.

GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao, SUJATHA NAGAR, BHADRADRI KOTHAGUDEM, TELANGANA - 507120 PRGI Reg No - TGTEL/26/A3993 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.